## 111 మెస్సీయా జన్మము

రా – ఆనందభైరవి (చాయ: వచ్చి గాబ్రియేలు పల్కెను) తా – త్రిపుట

[1]ఱేఁడు మెస్సీయ జన్మించెను – శ్రీదా – వీదు పురమున నుద్భవించెను = వేడుకతోడను – బాడుఁడి పాటలు = రూఢిగ సాతాను – కాడిని దొలఁగింప ॥ఱేఁడు॥

1. మనకొఱకై శిశువు పుట్టెను – అతఁడు – మన దోషములను బోగొట్టెను = అనయంబు నతనిమీఁ – దను రాజ్యపు భార – ము నుంచఁబడె విమో – చనకర్త యితఁ డౌను ॥ఱేఁడు॥
2. పరలోక సైన్యంబు గూడెను – మన – వర శిశువును గూర్చి పాడెను = నరులయందున గరుణ – ధర సమాధానంబు – చిర దేవునికి బహు – మహిమ యటంచును ॥ఱేఁడు॥
3. కొమ్మ యెష్షయినుండి పుట్టెను – చిగురు – క్రమ్మర మొద్దున బుట్టెను = కమ్మెను దేవుని యా – త్మమ్మును తెలివి జ్ఞా – న మ్మాలోచన మహ – త్వ మ్మొక్కుమ్మడినాతని ॥ఱేఁడు॥
4. సర్వశక్తి గల దేవుఁడు – మరియు – నుర్వియందు దయాస్వభావుఁడు = సర్వమహిమము గల్గు – స్వర్గ లోకము వదలి – గర్వముతో నిండిన – సర్వంసహా[2]స్థలిపై ॥ఱేఁడు॥
5. వింతైన వాఁడుగ నుండెను – కోరినంత సుందరత లేకుండెను = చింతతోడను మాయా – సంగతులగు వారి – యంతములేనట్టి – యాపదను వీక్షించి ॥ఱేఁడు॥
6. చెదరిన గొఱ్ఱెల వెదకును – వాని – ముదమున మందలోఁ జేర్చును = సదయత యేసుండు – జనితైక సుతుఁడు [3]భా – స్వదధిక విభుఁడాలో చన కర్త జన్మించె ॥ఱేఁడు॥
7. అక్షయుండగు యేసు వచ్చెను – మన – రక్షణమ్మును సిద్ధపర్చెను = మోక్షముఁ సరుణా క – టాక్షముతో నియ్య – నీక్షితియందున – హెబ్రీ వంశమునందు ॥ఱేఁడు॥

– ఎస్. జేమ్సు

[1]రాజు. [2]భూమి. [3]ప్రకాశించు.



## 112 రక్షకుని జననము

రా – మధ్యమావతి తా – అట

రక్షకుండుదయించినాఁడఁట – మనకొరకుఁబరమ – రక్షకుం డుదయించి నాఁడఁట = రక్షకుం డుదయించినాఁడు – రారె గొల్లబోయలార – తక్షణమునఁ బోయి మన ని – రీక్షణ ఫల మొందుదము ॥రక్షకుండు॥

1. దావీదు వంశమందు ధన్యుఁడు జన్మించినాఁడు = దేవుఁడగు యెహోవా మన – దిక్కుఁ దేరి చూచినాఁడు ॥రక్షకుండు॥
2. గగనమునుండి డిగ్గి – ఘనుఁడు గబ్రియేలు దూత = తగినట్టు చెప్పె వారికి – మిగుల సంతోషవార్త ॥రక్షకుండు॥
3. వర్తమానము జెప్పి దూత – వైభవమున పోవుచున్నాఁడు = కర్తను జూచిన వెనుక – కాంతుము విశ్రమం బప్పుడు ॥రక్షకుండు॥
4. పశువుల తొట్టిలోన – భాసిల్లు వస్త్రములజుట్టి = శిశువును గనుగొందురని – శీఘ్రముగను దూత తెల్పె ॥రక్షకుండు॥
5. అనుచు గొల్ల లొకరి కొక – రానవాలు జెప్పుకొనుచు = అనుమతించి కడకుఁ క్రీస్తు – నందరికినీ దెల్పినారు ॥రక్షకుండు॥

– మోచర్ల రాఘవయ్య

## 113 క్రీస్తు జన్మదినోత్సవము

రా – శంకరాభరణము తా – ఆది

సంతోషించుఁడి – యందరు నాతో – సంతోషించుఁడి – యొక = వింతయగు కీర్తనఁ బాడ వచ్చితిని – సంతోషించుఁడి – నాతో ॥సంతో॥

1. అంధకార మయమైన భూమి నా – ద్యంతము వెలిఁగింప – దాని యా – వేశముఁ దొలఁగింప = వందితుండు క్రీస్తేసు నాథుఁడు – వచ్చెఁ బ్రకాశుండై – భూమికి – నిచ్చె ప్రకాశంబు ॥సంతో॥
2. కాన నంధకారంబు దొలఁగఁ ప్ర – కాశించెను లెండు – మీరు ప్ర – కాశింపను రండు = మానవులను సంతోషపర్చనై – మహిని నవతరించె – భక్తుల – మనము సంతసించె ॥సంతో॥